సాక్షి
కాకినాడ

శనివారం । 2 । మార్చి । 2024



రూ.51 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి సలాది శ్రీనివాస్ దంపతులు (కపిలేశ్వరపురం) శుక్రవారం రూ.51 వేల విరాళం సమర్పించారు.



రామకృష్ణారెడ్డివి 'ఉనికి'పాట్లు

మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉనికి చాటుకోవడానికే అనేక ఫీట్లు చేస్తున్నారని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు.

II లో

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

6 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకూ మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వివరాలను ఈఓ బళ్ల నీలకంఠం శుక్రవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ఆరో తేదీ రాత్రి స్వామి వారి కల్యాణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, అంకురారోపణ, దీక్షాధారణ, మధ్యాహ్నం నంది వాహనంపై పట్టణంలో స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం, రాత్రి ధ్వజారోహణ అనంతరం ఆలయం వద్ద పార్కులో ప్రత్యేక వేదికపై కల్యాణం నిర్వహిస్తారు. ఏడో తేదీ ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన జరుపుతారు. ఎనిమిదో తేదీ మహా శివరాత్రి సందర్భంగా అర్ధరాత్రి ఒంటి గంట నుంచి స్వామివారి మూలవిరాట్ వద్ద అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 10 నుంచి 12.15 గంటల వరకూ పిఠాపురం మహారాజా వారి గోత్ర నామాలతో స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లింగోద్భవ కాల పూజ జరుపుతారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని దాతల సహకారంతో భక్తులకు పాలు, మజ్జిగ, అల్పాహారం, భోజనాల ఏర్పాట్లకు అనుమతిస్తామని ఈఓ తెలిపారు. తెల్లవారుజామున ఒంటి గంట నుంచి భక్తులను దర్శనాలకు అనుమతిస్తామన్నారు. తొమ్మిదో తేదీ ఉదయం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు, మధ్యాహ్నం 3.20 గంటలకు ధూపసేవ అనంతరం రథోత్సవం నిర్వహిస్తామని వివరించారు. పదో తేదీ ఉదయం త్రిశూల స్నానం, 11 గంటలకు తీర్థపు సేవ ఉంటాయని చెప్పారు. 11వ తేదీ రాత్రి శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని నీలకంఠం వివరించారు.

4న జాబ్‌మేళా



కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఈ నెల 4న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పీడీ కె.లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్(ఆపిల్ మొబైల్ మాన్యుఫ్యాక్చరింగ్)లో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, మెరైన్ ఫుడ్ కంపెనీలో సీనియర్ అకౌంటెంట్, ఒప్పో మొబైల్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, భారత్ ఫోర్జ్ కంపెనీలో టెక్నీషియన్, బృందావన్ హాస్పిటల్‌లో స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, పీఆర్‌ఓ, నిట్ ఐసీ ఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ఈ మేళా జరుగుతుందని వివరించారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం, ఉద్యోగాన్ని బట్టి భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు సోమవారం ఉదయం 9 గంటలకు తమ కార్యాలయానికి సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలని లచ్చారావు సూచించారు.

టెట్‌కు 584 మంది హాజరు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 3 కేంద్రాలలో శుక్రవారం 543 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ శుక్రవారం తెలిపారు. ఉదయం పరీక్షకు 298 మంది, మధ్యాహ్నం పరీక్షకు 245 మంది హాజరు కాగా 39 మంది గైర్హాజరయ్యారని వివరించారు.

నాడు...


అన్ని అర్హతలూ ఉన్నా పింఛన్ మంజూరు చేయాలంటే ముందుగా ఆ నియోజకవర్గ టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకోవాలి. జన్మభూమి కమిటీల కాళ్లు పట్టుకోవాలి. ఎంతో కొంత ముట్టజెప్పాలి. అప్పటికీ పింఛన్ మంజూరవుతుందో లేదో తెలియదు. ఒకవేళ మంజూరైనా.. ఆ డబ్బుల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయాలి. అప్పుడు కూడా ఎంతో కొంత ముట్టజెబితే తప్ప పింఛన్ అందని పరిస్థితి.

నేడు...

కేవలం అర్హత ఉంటే చాలు. వలంటీరే ఇంటికి వస్తారు. పింఛన్ దరఖాస్తు పూరించి, సంతకం చేయించి, సచివాలయంలో అందజేస్తారు. ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా.. ఎలాంటి వ్యయప్రయాసలు.. ఎవరి చుట్టూ తిరగనవసరం లేకుండా దరఖాస్తు చేసిన రోజులు, నెలల వ్యవధిలోనే పింఛన్ అర్హత పత్రం ఇంటికి తెచ్చి అందజేస్తున్నారు. ఆపై ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దకే వలంటీరు వచ్చి పింఛన్ డబ్బులు అందజేస్తున్నారు. ఇదీ సీఎం జగన్ ప్రభుత్వ హయాంలో సాగుతున్న సంక్షేమ పాలన.

మనవడి కానుక..
మలిసంధ్యలో ఊరట

- అవ్వాతాతలకు ఆర్థిక భరోసా
- రూ.3 వేల పింఛనుతో లబ్ధిదారుల్లో ఆనందం
- గతంకన్నా మిన్నగా మంజూరు
- జిల్లాలో 2,84,274 మంది పింఛన్‌దార్లు
- ప్రతి నెలా రూ.78.27 కోట్ల అందజేత



కరప మండలం పెదకొత్తూరులో మానుకొండ భాగ్యవతికి వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ బి.వరలక్ష్మి

కాకినాడ సిటీ: ఏ ఆధారమూ లేని అభాగ్యుల జీవితాల్లో వైఎస్సార్ పింఛన్ కానుక వెలుగులు నింపుతోంది. నా అనేవారు లేక, ఆదరణ కరువై జీవితాలను భారంగా నెట్టుకువస్తున్న పేద, బడుగు, బలహీన వర్గాల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, చేనేత కార్మికులు, మత్స్యకారులు, వృత్తి పనుల వారికి 'నేనున్నాను' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్నారు. దీనిపై పింఛన్‌దార్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి సిఫారసులూ లేకుండా కుల, మత, రాజకీయాలతో సంబంధం లేకుండా.. కేవలం అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తుండటంతో లబ్ధిదారులు.. ముఖ్యంగా అవ్వాతాతలు మురిసిపోతున్నారు. గతం కంటే మూడు రెట్లు అధికంగా పింఛన్ నగదు ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటి వద్దనే అందుతుండటంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేవు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 జనవరి నాటికి సామాజిక పింఛన్ నగదు రూ.1,000 మాత్రమే అందేది. ఎన్నికల ముందు దీనిని హడావుడిగా రూ.2 వేలకు పెంచారు. సీఎం జగన్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే దీనిని రూ.2,250కి పెంచారు. ఇచ్చిన మాటకు ఏటా రూ.250 చొప్పున పెంచుతూ వచ్చారు. గత జనవరి నుంచి ఈ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారు. దీంతో తమకు ఆర్థిక భరోసా కలిగిందని వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఉప్పలంకలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి నాగేంద్రకుమార్

గత ప్రభుత్వంలో అర్హులైనప్పటికీ ఎంతో మందికి పింఛన్లు రాకుండా జన్మభూమి కమిటీల పేరుతో అడ్డుకున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పెన్షన్ పొందడానికి లబ్ధిదారులు పడుతున్న కష్టాలను ప్రజా సంకల్ప యాత్రలో ప్రత్యక్షంగా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి.. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పెన్షన్‌దారులకు ఇళ్ల వద్దనే లబ్ధి అందించే లక్ష్యంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతి 50 ఇళ్లకూ ఒక వలంటీర్‌ను నియమించారు. కేవలం అర్హతే ప్రామాణికంగా పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారు. అర్హత ఉండీ సాంకేతిక కారణాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా మిగిలిపోయిన వారిని.. గడప గడపకూ మన ప్రభుత్వం, కొద్ది నెలల కిందట నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల ద్వారా గుర్తించారు. వారందరికీ పింఛన్లు, పథకాలు మంజూరయ్యేలా చర్యలు చేపట్టారు. జిల్లాలో ఏటా సుమారు పది వేల మంది కొత్తగా పింఛన్లు అందుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 2,84,274 మంది వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.78.27 కోట్ల మేర పింఛన్లు అందజేస్తున్నారు. పొలాల్లో ఉన్నా, ఆసుపత్రుల్లో ఉన్నా, వేరే ఊర్లలో ఉండి చికిత్స పొందుతున్నా కూడా అక్కడకు వెళ్లి మరీ పింఛన్లు అందజేస్తూ వారి కళ్లల్లో వలంటీర్లు ఆనందం నింపుతున్నారు.

జగనన్న మళ్లీ రావాలి



మా పింఛనును రూ.3 వేలకు పెంచి ఇస్తున్న జగనన్నకు ఎంతో రుణపడి ఉంటాం. ఇలాంటి నేత మనకు ముఖ్యమంత్రిగా ఉండటం చాలా సంతోషంగా ఉంది. ఆయన మళ్లీ రావాలి. ఇలాంటి సీఎంను గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– కేతవరపు బాబ్జీ, సాంబమూర్తి నగర్, కాకినాడ

జగన్ చల్లగా ఉండాలి



మాలాంటి వృద్ధులకు పెద్ద కొడుకులా జగన్ వృద్ధాప్య పింఛన్‌ను రూ.3 వేలకు పెంచారు. ప్రతి నెలా 1న వలంటీర్ మా ఇంటికి వచ్చి పింఛన్ నగదు అందిస్తున్నారు. రేషన్ సరుకులు కూడా ఇళ్ల వద్దకే వస్తున్నాయి. మాలాంటి వృద్ధులను ఆదుకుంటున్న జగన్ చల్లగా ఉండాలి.

– పిట్టా అప్పయమ్మ, రాజీవ్ గృహకల్ప, కాకినాడ

జిల్లాలో మండలాల వారీగా పింఛన్ల వివరాలు

మండలం	పింఛన్లు
గండేపల్లి	8,654
గొల్లప్రోలు	7,946
గొల్లప్రోలు అర్బన్	2,998
జగ్గంపేట	12,484
కాజులూరు	10,276
కాకినాడ రూరల్	18,587
కాకినాడ అర్బన్	31,075
కరప	11,760
కిర్లంపూడి	11,578
కోటనందూరు	8,048
యు.కొత్తపల్లి	13,005
పెదపూడి	10,796
పెద్దాపురం	12,039
పెద్దాపురం అర్బన్	6,262
పిఠాపురం	12,039
పిఠాపురం అర్బన్	5,932
ప్రత్తిపాడు	12,055
రౌతులపూడి	8,264
సామర్లకోట	12,040
సామర్లకోట అర్బన్	6,558
శంఖవరం	7,875
తాళ్లరేవు	11,795
తొండంగి	12,955
తుని	12,618
తుని అర్బన్	5,621
ఏలేశ్వరం	6,912
ఏలేశ్వరం అర్బన్	3,878

'ప్రసాద్' నిర్మాణాలకు స్థల పరిశీలన

అన్నవరం: పిలిగ్రిమేజ్ రీజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీము కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 కోట్లతో వివిధ నిర్మాణాలు చేపట్టే స్థలాలను అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ నిధులతో అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, టాయిలెట్ బ్లాక్ నిర్మించనున్నారు. ఇందుకు అవసరమైన స్థలాలను రాష్ట్ర పర్యాటక శాఖ ఈఈ రాజారావు, దేవస్థానం ఈఈ మురళి, డీఈ బీఎస్ రాంబాబు తదితరులు పరిశీలించారు. అనంతరం దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్‌తో సమావేశమయ్యారు. ప్రసాద్ నిధులతో పాత టీటీడీ భవనం స్థలంలో మూడంతస్తుల అన్నదాన భవనం నిర్మించేందుకు గతంలోనే ప్రతిపాదించారు. ఇప్పుడు దానినే ఖరారు చేశారు. అలాగే, ప్రస్తుత అన్నదాన భవనం వద్ద ఉన్న క్యూ లైన్‌పై షెడ్డు ఉన్న స్థలంలో క్యూ కాంప్లెక్స్ నిర్మిస్తారు. అక్కడి నుంచి భక్తులు వ్రత మండపం మీద ఉన్న క్యూ లైన్‌కు వెళ్లేలా మూవబుల్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథోత్సవం జరిగేటప్పుడు ఈ బ్రిడ్జి అడ్డం లేకుండా పక్కకు జరిపేలా ఏర్పాటు చేయనున్నారు. అలాగే, ప్రకాష్ సదన్ వెనుక ప్రస్తుతం పార్కింగ్ స్థలంగా వాడుతున్న ప్రదేశంలో అటు సత్యగిరి, ఇటు రత్నగిరికి దగ్గరగా టాయిలెట్ బ్లాక్ నిర్మించనున్నారు. ప్రసాద్ నిధులతో దేవస్థానానికి రెండు ఎలక్ట్రిక్ బస్సులు కూడా మంజూరు చేస్తున్నట్టు సమాచారం. ఈ బస్సులను దేవస్థానం సత్రాల నుంచి స్వామివారి ఆలయానికి భక్తులను తరలించేందుకు ఉపయోగించనున్నారు. ప్రసాద్ నిధులతో నిర్మించనున్న నిర్మాణాల స్థలాలను, ఈ నెల 7న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా చేసే శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించేందుకు కేంద్ర పర్యాటక అధికారులు రెండు రోజుల్లో రత్నగిరికి రానున్నారని సమాచారం.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా వ్యాప్తంగా 59 కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షకు 20,389 మంది హాజరవగా, 656 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యలో జనరల్ ఫౌండేషన్ కోర్సు (జీఎఫ్‌సీ) పరీక్షలకు 1,775 మంది హాజరు కాగా 118 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదు. తొలి రోజు 24 పరీక్ష కేంద్రాలను స్క్వాడ్‌లు తనిఖీ చేశాయి. ఆరు కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షించాయి. 144 సెక్షన్ విధించడంతో అన్ని పరీక్ష కేంద్రాల గేట్లను ఉదయం 9 గంటలకే మూసివేశారు. కలెక్టరేట్ వద్ద టీడీపీ, జనసేన శ్రేణులు ధర్నా నిర్వహించడంతో విద్యార్థులు కాసేపు అవస్థలకు గురయ్యారు. నగరంలోని పరీక్ష కేంద్రాలను జిల్లా వృత్తి విద్య అధికారి నూకరాజు తనిఖీ చేశారు.

అందుబాటులోకి ఆహ్లాదం

- మంత్రి దాడిశెట్టి రాజా
- గణపతి నగర్ పార్కు ప్రారంభం
- రూ.1.50 కోట్లతో నిర్మాణం



మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణితో కలిసి పార్కును ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. పట్టణంలోని గణపతి నగర్‌లో రూ.1.50 కోట్లతో నిర్మించిన పొట్టి శ్రీరాములు మున్సిపల్ పార్కును మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సిద్ధిరెడ్డి గౌరీ వనజ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంతో ఎవరికీ అందనంత ఎత్తున నిలిపారని అన్నారు. తునిలో అన్ని రకాల అధునాతన సదుపాయాలతో నిర్మించిన పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గత ప్రభుత్వం ప్రజల కోసం కాకుండా సొంత ప్రయోజనం కోసం పని చేసిందని, దీనికి భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక సంక్షేమంతో పాటు అభివృద్ధి చేసి చూపించామని చెప్పారు. ఈ పార్కును పట్టణానికే తలమానికంగా తీర్చిదిద్దామన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకూ సాయంత్రం వేళల్లో సేద తీరేందుకు పలు సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. రాష్ట్ర ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు పేరును ఈ పార్కుకు పెట్టామని చెప్పారు. పార్కు నిర్వహణను పురపాలక సంఘం చూసుకుంటుందన్నారు. వాకర్లు సొంతింటిలా ఈ పార్కును చూసుకోవాలన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు తాండవ నదికి రిటైనింగ్ వాల్, మెయిన్ రోడ్డు విస్తరణ రాబోయే ఐదేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి, రానున్న ఎన్నికల్లో ఓటు వేసి మరోసారి గెలిపించాలని కోరారు. పార్కులో ఏర్పాటు చేసిన ఐకాన్, షటిల్ కోర్టు, జిమ్, పిల్లల ఆట వస్తువులు, ఓపెన్ ఆడిటోరియాన్ని మంత్రి రాజా లాంఛనంగా ప్రారంభించారు. అంతకు ముందు ఆయనకు వాకర్స్ క్లబ్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, ఎంపీపీలు డాక్టర్ బొప్పన రాము, లగుడు శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ కుచ్చర్లపాటి రూపాదేవి, ప్రభుత్వ బాలికల కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దీవెనలందుకున్నారు

- జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల
- జిల్లాలో 41,474 మందికి లబ్ధి
- విద్యార్థులు, తల్లుల జాయింట్ ఖాతాల్లో రూ.28.84 కోట్ల జమ



విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

కాకినాడ సిటీ: జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి జిల్లాలోని 41,474 మంది విద్యార్థులకు రూ.28.84 కోట్ల మేర లబ్ధి చేకూరిందని కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. జగనన్న విద్యా దీవెన (పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్) మొత్తాన్ని నేరుగా విద్యార్థులు, వారి తల్లుల జాయింట్ ఖాతాల్లో జమ చేసే రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లా పామర్రులో శుక్రవారం ప్రారంభించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, గాండ్ల, తెలికల కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరు వీరప్రసాద్, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ బిళ్లకుర్తి నాగమణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, విద్యార్థులు వర్చువల్‌గా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ నమూనా చెక్ అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చదువు ప్రాధాన్యాన్ని గుర్తించి అనేక విప్లవాత్మక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని అన్నారు. పేద పిల్లల ఉన్నత చదువులకు ఆర్థిక సమస్యలు అడ్డంకి కాకూడదనే సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. విద్యా దీవెన పథకం ద్వారా ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదువుతున్న పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం మైనారిటీ, కాపు, క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజులను ప్రతి త్రైమాసికం ముగిసిన వెంటనే క్రమం తప్పకుండా కుటుంబంలోని అర్హులైన పిల్లలందరికీ వర్తించేలా ప్రభుత్వం చెల్లిస్తోందని వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ బాగా చదువుకుని కెరీర్ పరంగా ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి సాంఘిక సంక్షేమ అధికారి వై.వాణి, గిరిజన సంక్షేమ అధికారి ఏవీ జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

చదువుపై ఆసక్తి పెరిగింది



డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా జగనన్న విద్యా దీవెన పథకం కింద ఆర్థిక సహాయం అందించడంతో చదువుపై ఆసక్తి పెరిగింది. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహం విద్యార్థుల జీవితాశయాలకు పునాది వేసుకునేందుకు బాసటగా నిలుస్తుంది. విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ పథకాన్ని అందించిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– ఎస్.లలిత, పీఆర్ డిగ్రీ కళాశాల, కాకినాడ

పేదల చదువుకు భరోసా



నేను బీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాను. పేద విద్యార్థులకు చదువులకు ఆటంకం కలగకుండా జగనన్న ఆర్థిక భరోసా కల్పించారు. జగనన్న విద్యాదీవెన పథకం వల్ల నాలాంటి పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి వివక్షా లేకుండా అన్ని వర్గాల వారికీ జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అందిస్తోంది. విద్యా రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిన చొరవతో పేద విద్యార్థులకు కూడా ఉన్నత చదువులు అందుబాటులోకి వచ్చాయి.

– ఎస్.అభిషేక్, పీఆర్ డిగ్రీ కళాశాల, కాకినాడ

క్లుప్తంగా

నాలుగు కేజీల గంజాయి పట్టివేత



గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న పోలీసులు

గోపాలపురం: అక్రమంగా తరలిస్తున్న నాలుగు కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై కర్రి సతీష్ కుమార్ తెలిపారు. గోపాలపురం మండలం జగన్నాథపురం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా విశాఖ జిల్లా నుంచి హైదరాబాద్ వెళుతున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరి బ్యాగుల్లో నాలుగు కేజీల గంజాయి బయటపడినట్లు తెలిపారు. వీరు పోలీసుల కళ్లు గప్పి వాహనాలు మారుతూ పోలీసులకు చిక్కకుండా చెక్‌పోస్టు దగ్గరలో వాహనాల నుంచి దిగిపోయి చెక్‌పోస్టు దాటిన తర్వాత మరో వాహనంలో ఎక్కుతూ ప్రయాణిస్తున్నట్లు ఎస్సై చెప్పారు. ఈ దాడుల్లో సివిల్ సప్లై డీటీ ప్రదీప్‌కుమార్, వీఆర్వోలు నాగలక్ష్మి, మురళీకృష్ణ పోలీసులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎస్పీ జగదీష్
గోపాలపురం మండలంలోని వివిధ పోలింగ్ స్టేషన్లను శుక్రవారం ఎస్పీ పి.జగదీష్ పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేందుకు సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

తలుపులమ్మను దర్శించుకున్న సినీనటుడు అల్లరి నరేశ్



అల్లరి నరేశ్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న లోవ ఉద్యోగులు

తుని రూరల్: ప్రముఖ సినీ నటుడు అల్లరి నరేశ్ తలుపులమ్మ అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం దేవస్థానానికి సన్నిహితులతో వచ్చిన ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితులు, అర్చకులు ఆశీర్వదించారు. అల్లరి నరేశ్‌కు లోవ దేవస్థానం ఉద్యోగులు అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

అన్నవరం: సినీ నటుడు అల్లరి నరేష్ శుక్రవారం రత్నగిరి పై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు.

పరిహారం ఇవ్వాల్సిందే

- ఓఎన్‌జీసీ పనులు అడ్డుకున్న మత్స్యకారులు
- ఏటిమొగ వద్ద కార్యకలాపాల అడ్డగింపు
- హామీ ఇచ్చేవరకు తగ్గేది లేదని అల్టిమేటం
- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి సంఘీభావం



మత్స్యకారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



మత్స్యకారులు నిలువరించిన ఓఎన్‌జీసీ పైపులు

కాకినాడ: ఓఎన్‌జీసీ కార్యకలాపాల కారణంగా తీవ్రంగా నష్టపోతున్న కాకినాడ పరిసర ప్రాంత మత్స్యకారులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిరసన గళం విప్పారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న ఈ ప్రాంత మత్స్యకారులకు న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఉద్యమిస్తామంటూ అల్టిమేటం ఇచ్చారు. దీంతో ఓఎన్‌జీసీ కార్యకలాపాలకు బ్రేక్ పడింది. వివరాల్లోకి వెళ్తే... ఓఎన్‌జీసీ, రిలయన్స్ వంటి చమురు సంస్థలు సముద్రంలో ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు వెలికితీసే పనులను సుదీర్ఘకాలంగా కొనసాగిస్తున్నాయి. సదరు సంస్థల కార్యకలాపాల నేపథ్యంలో సముద్ర వేటనే జీవనాధారంగా చేసుకున్న మత్స్యకారుల ఉపాధికి భంగం కలుగుతోంది. దీంతో తాళ్లరేవు, భైరవపాలెం సహా పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 65 మత్స్యకార గ్రామాలకు చమురు సంస్థలు పరిహారాన్ని అందిస్తున్నాయి. అయితే కాకినాడ ఏటిమొగ ప్రాంతం మీదుగా కార్యకలాపాలు కొనసాగిస్తూ తమ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఎన్నో ఏళ్లుగా ఇక్కడి మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎటువంటి న్యాయం జరగని పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోంది.

పనులు అడ్డగించిన మత్స్యకారులు
చమురు సంస్థల నుంచి స్పందన లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా ఆగ్రహంతో రగిలిపోతున్న కాకినాడ పరిసర ప్రాంత మత్స్యకారులు శుక్రవారం నిరసన గళం విప్పారు. సముద్రగర్భంలోకి పైపులైన్లను తరలిస్తున్న సమయంలో శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఓఎన్‌జీసీకి చెందిన వాహనాలను మత్స్యకారులంతా అడ్డుకున్నారు. బార్జీపైకి పైపులైన్లు తరలిస్తున్న సమయంలో అక్కడ బార్జిలు, ఇతర వాహనాలను నిలుపుచేసి పరిహారం ఇవ్వాల్సిందేనంటూ నినదించారు. ఆ నోటా, ఈ నోటా విషయం పొక్కడంతో వందలాది మంది మత్స్యకారులు అక్కడికి తరలివచ్చి నిరసన కొనసాగించారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి సంఘీభావం
స్థానిక మత్స్యకారుల ద్వారా సమాచారం తెలుసుకున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మద్దతు ప్రకటించారు. ఈ ప్రాంత మత్స్యకారుల న్యాయసమ్మతమైన డిమాండ్‌కు తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కాకినాడ పరిసర ప్రాంత మత్స్యకారులకు పరిహారం ప్రకటించేవరకు తాను కూడా పోరాడతానని హామీ ఇచ్చారు. 2009 నుంచి పరిహారం ఇవ్వాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ కొంత మంది రాజకీయ నాయకుల స్వార్థం వల్ల న్యాయం జరగలేదన్నారు. సముద్రంలో రిగ్ కార్యకలాపాలు జరుగుతున్న ప్రాంతంలో ఇక్కడి మత్స్యకారులు కూడా వేటకోసం వెళ్తారని, అలాంటప్పుడు వీరికి పరిహారం ఇవ్వడంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని నిలదీశారు. ఈ విషయమై మత్స్యకారులు, మత్స్యకార ప్రతినిధులు, ఓఎన్‌జీసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. అప్పటి వరకు పనులు నిలుపుదల చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. కాగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏటిమొగ రేవు కాల్వ వద్ద మత్స్యకారులు టెంట్‌లు ఏర్పాటు చేసి నిరసన కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్.ఎస్.రాజు, మత్స్యకార ప్రముఖులు కాటాడి జానికిరామ్, స్థానిక నాయకులు, స్థానిక మత్స్యకార పెద్దలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డివి ఉనికిపాట్లు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజం
- మాజీ ఎమ్మెల్యే తీరును ఎండగట్టిన ఎమ్మెల్యే



వైఎస్సార్ సీపీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



ఎమ్మెల్యేకు మద్దతుగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

అనపర్తి: రాజకీయంగా నానాటికీ తీసికట్టు అన్న చందంగా తయారవుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన ఉనికిని చాటుకోవడానికే అనేక పాట్లు...ఫీట్లు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల సవాళ్ల ప్రతి సవాళ్లతో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో శుక్రవారం తనకు మద్దతుగా నియోజకవర్గంలోని పెదపూడి, బిక్కవోలు, అనపర్తి, రంగంపేట మండలాల నుంచి తన స్వగృహం వద్దకు వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ అబద్ధాలు మాట్లాడడం మాజీ ఎమ్మెల్యేకు అలవాటేనన్నారు. అనపర్తి రాజకీయ చరిత్రలో అవినీతి సామ్రాట్‌గా పేరొందిన మాజీ ఎమ్మెల్యే తన నలుపు తాను చూసుకోకుండా, నేను అవినీతికి పాల్పడ్డానంటూ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా రామకృష్ణారెడ్డి తన అవినీతితో నియోజకవర్గాన్ని పీల్చి పిప్పి చేశారని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే అవినీతి చిట్టాను ఆయనకు ముడుపులు చెల్లించిన వారే స్వయంగా ఆడియో, వీడియోల రూపంలో వెల్లడించారని, అయితే ఆయన ఏనాడూ వాటిని ఖండించిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. అవినీతికి పాల్పడ్డానంటూ మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తనపై వెయ్యి రాళ్లు విసిరినా ఒక్కటి కూడా తనను తాకలేదని అన్నారు. నర్సింగ్‌హోం వద్ద తాను లేనన్న విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తనపై ముద్రించిన కరపత్రాన్ని తీసుకుని అక్కడకు వచ్చి సిబ్బందికి, ప్రజలకు పంపిణీ చేయడం ద్వారా కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని అన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యేను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసినప్పటికీ పోలీసుల కళ్లుగప్పి రామవరం ప్రధాన రహదారిపై బైఠాయించిన ఆయన చర్చకు సిద్ధమని నేను ప్రకటించినప్పటికీ శుక్రవారం అనపర్తి రాలేకపోవడమేమిటని ప్రశ్నించారు.

విషయాన్ని పక్కదారి పట్టించేందుకే హైడ్రామా
అనపర్తి వస్తే ఏమి జరుగుతుందో రామకృష్ణారెడ్డికి తెలుసని, పబ్లిసిటీ స్టంట్ సృష్టించడంలో ఆరితేరిన మాజీ ఎమ్మెల్యే విషయాన్ని పక్కదారి మళ్లించేందుకు హైడ్రామా సృష్టించే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. పసలేని ఆరోపణలు చేస్తే వైఎస్సార్ సీపీ శ్రేణులు తగిన గుణపాఠం చెబుతాయని హెచ్చరించారు. రాష్ట్రంలో అన్ని సర్వే సంస్థలు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని వెల్లడిస్తున్నాయని, టీడీపీకి అనుకూలంగా పనిచేసే సర్వే సంస్థలు సైతం అనపర్తిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థే విజయం సాధిస్తారన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. రాజకీయంగా ప్రజా మద్దతును కోల్పోయిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రజల్లో సానుభూతిని పొందే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్న మాజీ ఎమ్మెల్యే కలలు కల్లలు గాక తప్పదని అన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం
మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలకు ఎమ్మెల్యే స్పందిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అనపర్తి పరిసర గ్రామాలకు చెందిన దాతలు ఇచ్చిన విరాళాలు, వాటిని ఏవిధంగా వినియోగించినది ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేగా అవినీతికి పాల్పడ్డానని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించారు. రాబోయే ఎన్నికలో కురుక్షేత్రంలో ప్రజలే న్యాయ నిర్ణేతలని, ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే తనపై చేసిన అవినీతి ఆరోపణలు ఖండించడంతోపాటు తనకు మద్దతు తెలియజేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వ్రత పురోహితుల పారితోషికం రూ.ఐదు వేలు పెంపు

- 254 మందికి లబ్ధి
- ఈ నెల నుంచే అకౌంట్లకు జమ
- విశ్రాంత పురోహితుల పెన్షన్ రూ.500 పెంపు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానంలో సేవలందిస్తోన్న 254 మంది వ్రత పురోహితుల పారితోషికం పెరిగింది. దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు వ్రత పురోహితులు పొందుతున్న పారితోషికానికి రూ.ఐదు వేలు కలిపి ఈ నెలలో వారి అకౌంట్‌కు జమ చేశారు. విశ్రాంత పురోహితుల పెన్షన్ కూడా రూ.500 పెంచారు. దేవస్థానం వ్రత విభాగంలో విధులు నిర్వహిస్తున్న పురోహితులకు వ్రతాల ఆదాయంలో 40 శాతం పారితోషికంగా చెల్లిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ పారితోషికాన్ని ప్రతి నెలా పురోహితుల గ్రేడ్‌ను అనుసరించి చెల్లించగా మిగిలిన మొత్తాన్ని సంవత్సరాంతాన ఎరియర్స్ రూపంలో చెల్లిస్తున్నారు. ఈ విధంగా ఎరియర్స్ రూపంలో ఒక్కొక్కరికి రూ.70 వేల నుంచి రూ. 80 వేల వరకు వస్తోంది.

కాగా, గత నెలలో వ్రత పురోహితులు ఈ విషయాన్ని వివరిస్తూ తమకు ఎరియర్స్ రూపంలో చెల్లిస్తున్న మొత్తం నుంచి ప్రతీ నెల రూ.ఐదు వేలు అదనంగా చెల్లించాలని, అలా చెల్లించిన తరువాత మిగిలిన మొత్తాన్ని సంవత్సరాంతాన ఎరియర్స్ రూపంలో చెల్లించాలని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె. రామచంద్రమోహన్‌ను కోరారు. దీనిపై చైర్మన్, ఈఓ సానుకూలంగా స్పందించారు. కాగా, ఫిబ్రవరి నెల నుంచి రూ.ఐదు వేలు పెంచి మార్చి నెల పారితోషికంతో కలిపి చెల్లించాలని ఈఓ ఆదేశాలు జారీ చేశారు.

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పురోహితులకు లబ్ధి
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్రత పురోహితులకు అనేక రూపాలలో లబ్ధి చేకూరింది. 2020, 22 సంవత్సరాలలో సుమారు 60 వ్రత పురోహిత పోస్టులు రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేశారు. వ్రతాల ఆదాయంలో పురోహితులకు చెల్లిస్తున్న 30 శాతం పారితోషికాన్ని 40 శాతానికి పెంచుతూ 2022 నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివలన ఒక్కో పురోహితుని పారితోషికం సుమారు రూ.ఐదు వేలు పెరిగింది. 20 సంవత్సరాల తరువాత ఈ విధంగా పారితోషికం పెరగడంతో పురోహితులు హర్షం వ్యక్తం చేశారు. విశ్రాంత పురోహితులకు వారి సర్వీసును అనుసరించి ఏడాదికి పది వేలు చొప్పున గ్రాట్యుటీ కూడా చెల్లించారు. దీనివలన ఒక్కో విశ్రాంత పురోహితుడు రూ.లక్ష నుంచి రూ. 3.5 లక్షల వరకు లబ్ధి పొందారు.

పారితోషికం పెరిగిందిలా...
ప్రస్తుతం స్పెషల్ గ్రేడ్ పురోహితులు 12 మందికి ఒక్కొక్కరికి రూ.40 వేలు చెల్లిస్తుండగా ఈ నెల నుంచి రూ.45 వేలు, 48 మంది మొదటి గ్రేడ్ పురోహితులకు రూ.37 వేలు చెల్లిస్తుండగా ఈ నెల నుంచి రూ.42 వేలు, రెండో గ్రేడ్ వంద మంది పురోహితులకు రూ.35 వేల నుంచి రూ.40 వేలు, మూడో గ్రేడ్ పురోహితులు 94 మందికి రూ.31 వేల నుంచి రూ.36 వేలు అకౌంట్‌కు జమ చేశారు. దీంతోబాటు 56 మంది విశ్రాంత పురోహితులకు రూ.500 పెన్షన్ కూడా పెంచుతూ ఈఓ ఆదేశాలిచ్చారు. అది కూడా ఈ నెల నుంచే అమలులోకి వచ్చింది.

చైర్మన్, ఈఓలకు కృతజ్ఞతలు
తమ వినతిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్‌లకు కల్యాణ బ్రహ్మ, వైదిక కమిటీ సభ్యుడు ఛామర్తి కన్నబాబు, వ్రత పురోహిత సంఘం మాజీ అధ్యక్షులు నాగాభట్ల రవిశర్మ, కర్రి సూర్యనారాయణ, స్పెషల్‌గ్రేడ్ సూపర్‌వైజర్లు మంధా శ్రీరామచంద్ర మూర్తి, తాయ్యేటి హరిబాబు కృతజ్ఞతలు తెలియచేశారు.

'పోతిక' పడిపోకుండా చర్యలు



పోతికకు చేసిన సిమెంట్ ప్లాస్టింగ్

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో దర్బారు మంటపంలోని భక్తుల క్యూ లో ఒక స్తంభం మీద బీటలు వారిన 'పోతిక' పడిపోకుండా ఇంజినీరింగ్ సిబ్బంది చర్యలు చేపట్టారు. మంటపంలోని స్తంభాలకు అలంకరణ కోసం నాలుగు వైపులా సిమెంట్‌తో తయారు చేసిన 'పోతిక' (అలంకరణలో భాగంగా ఏర్పాటు చేసినది) లు ఏర్పాటు చేశారు. వాటిలో ఒకటి బీటలు వారి స్తంభం నుంచి విడిపోయి ఏ క్షణంలో అయినా భక్తుల నెత్తిన పడే అవకాశం ఉండడంతో శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'తలపై పడితే ప్రమాదమే' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో ఈఓ రామచంద్రమోహన్ స్పందించి ఇంజినీరింగ్ అధికారులను అలర్ట్ చేశారు. దాంతో వారు ఆ పోతిక పడిపోకుండా ఆ బీటలలో సిమెంట్ కాంక్రీట్ కూరారు. పోతిక పడిపోతుందేమోనని ఊపి చూశామని అది చాలా గట్టిగా ఉందని అందువలన దానికి సిమెంట్‌తో ప్లాస్టింగ్ చేశామని అధికారులు తెలిపారు.

వేలం నిర్వహించే ఆస్తుల ప్రదర్శన



సమావేశంలో పాల్గొన్న జోనల్ మేనేజర్ సుధాకరరావు

రాజమహేంద్రవరం సిటీ: ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మార్చి నెలలో ఈ వేలం నిర్వహించే 45 ఆస్తుల వివరాల ఫొటో ప్రదర్శన ఇండియన్ బ్యాంక్ జోనల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు జోనల్ మేనేజర్ సుధాకర్‌రావు శుక్రవారం తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల జోనల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రదర్శన తిలకించేందుకు శుక్రవారం 35 మంది ఔత్సాహికులు తరలివచ్చారని, శనివారం సైతం ప్రదర్శన ఉంటుందన్నారు. ఆసక్తిగల కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రికవరీ టీం చీఫ్ మేనేజర్ దీపక్ కుమార్, జాయ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని కోరంగి వంతెన వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బచ్చల రాహుల్(27) మృతి చెందగా, మరొక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన బచ్చల రాహుల్, సర్పవరం గ్రామానికి చెందిన అతని బంధువు బళ్ల సునీల్ ఇరువురు బైక్‌పై యానాం వెళ్లి తిరిగి వస్తుండగా కోరంగి వంతెన దిగువన ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రాహుల్ తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. కొన ఊపిరితో ఉన్న రాహుల్‌ను బతికించేందుకు ఇద్దరు యువకులు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. దీంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. కాగా మరొక యువకుడు సునీల్‌కు కాలు విరిగిపోయింది. పలుచోట్ల గాయాలు కావడంతో రక్త స్రావమైంది. అతన్ని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్‌ఎ++గుర్తింపు



వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల అటానమస్‌కు న్యాక్ ఎ++గుర్తింపు లభించినట్టు కళాశాల వైస్ చైర్మన్ ఎస్.సతీష్ రెడ్డి తెలిపారు. ల్యాబ్, లైబ్రరీ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, మౌలిక సదుపాయాలు, తదితర అంశాలను పరిశీలించిన నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ త్రిసభ్య బృందం సిఫారసు మేరకు తమ కళాశాలకు 3.51 స్కోర్‌తో నాక్ ఎ++ గుర్తింపు లభించినట్టు తెలియజేశారు. భారతదేశంలోని విద్యాసంస్థల, యూనివర్సిటీల క్వాలిటీ స్టేటస్, కరిక్యులం, టీచింగ్ లెర్నింగ్ ప్రాసెస్, ఫ్యాకల్టీ రీసెర్చ్ కళాశాల మౌలిక వసతులు, ఆర్థిక వనరులు తదితర అంశాలను ప్రమాణాలుగా తీసుకుని ఈ గుర్తింపు ఇచ్చారన్నారు.

జనసేనకు మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసరావు రాజీనామా

ఈ నెల 5న 200 మందితో వైఎస్సార్ సీపీలో చేరేందుకు నిర్ణయం

కొత్తపేట: మండల పరిధిలోని వానపల్లి గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు ఆ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని పొత్తు కుదుర్చుకున్న టీడీపీ - జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావును ప్రకటించడాన్ని నిరసిస్తూ జనసేన నుంచి బయటకు వచ్చినట్టు వానపల్లి గ్రామ జనసేన అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ టిక్కెట్లు ప్రకటనకు నాలుగురోజుల ముందు కొత్తపేట నియోజకవర్గ టిక్కెట్ మీదేనని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావుకు హామీ ఇచ్చి, తీరా టీడీపీకి కేటాయించి శ్రీనివాసరావుకు తీవ్ర అన్యాయం చేసి, అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కనీసం మూడోవంతు స్థానాలు కూడా తీసుకోకుండా కేవలం 24 స్థానాలతో సరిపెట్టుకోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. కాపు, బడుగు, బలహీనవర్గాలను పవన్ కళ్యాణ్ ఉద్ధరిస్తారని నమ్మి ఆ పార్టీలో ప్రయాణం చేశామని అయితే టీడీపీ అధినేత చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారారని విమర్శించారు. జనసేనను చంద్రబాబు ఒక పథకం ప్రకారం అణచివేస్తున్నారని, ఈ విషయాన్ని పవన్‌కళ్యాణ్ గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇంకా జనసేనలోనే పనిచేయడం కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్టేనని ఆందోళన వ్యక్తం చేశారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి, సేవాదృక్పథంతో పనిచేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి మద్దతుగా వైఎస్సార్ సీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 5న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో సుమారు 200 మందితో ఆ పార్టీలో చేరుతున్నట్టు శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

- 7నెలలుగా మార్చురీలో ఫ్రీజర్ పని చేయని వైనం
- ఐస్‌తెచ్చుకుని మృతదేహాలను భద్రపరచుకుంటున్న బంధువులు

యానాం: యానాం-దరియాలతిప్ప రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం నియోజకవర్గ పరిధిలోని కురసాంపేటకు చెందిన అరదాడి నూకరాజు, మేడా రాంబాబు సావిత్రినగర్ వైపు మార్కెట్‌కు బైక్‌పై వెళుతుండగా దరియాలతిప్ప నుంచి వస్తున్న అదే గ్రామానికి చెందిన రేవు మల్లీశ్వరరావు బైకు దొమ్మేటిపేట యానాం స్టీల్స్ ఫ్యాక్టరీ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అరదాడి నూకరాజు(45)తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా మేడా రాంబాబు, రేవు మల్లీశ్వరరావు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మృతుడు అరదాడి నూకరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా యానాం జీజీహెచ్‌లో మార్చురీ గదిలో మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్ బాక్స్ ఏడు నెలల నుంచి పనిచేయకపోవడంతో మృతుని బంధువులు ఐస్ తెచ్చుకుని భద్రపరుచుకుంటున్నారు. ఒక్కోసారి ఓల్డేజ్‌హోమ్‌నుంచి ఫ్రీజర్‌బాక్స్‌లను తెచ్చుకుంటూ మృతదేహాలను భద్రపర్చుకుంటున్నారని ఈ సమస్యను ఉన్నతాధికారులు పట్టించుకోవాలని కోరారు. అరదాడి నూకరాజు మృతదేహాన్ని సైతం ఐస్ తెచ్చుకుని భద్రపరిచారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



రాజోలు: చింతలపల్లి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పైడిపర్తి సత్యసాయిబాబా(59) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. రోజువారీ విధుల్లో భాగంగా సత్యసాయిబాబా పాఠశాలకు వచ్చి మూడవ పిరియడ్‌లో తరగతి గదిలో ఛాతిలో నొప్పిగా ఉందని కూలబడిపోయారు. దీంతో సహచర ఉపాధ్యాయులు స్థానిక ఆస్పత్రికి తరలించి సీపీఆర్ చేసి అంబులెన్స్‌లో అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సత్యసాయిబాబా మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాట్రేనిపాడు గ్రామానికి చెందిన ఆయన పొన్నమండ, కాట్రేనిపాడు, చింతలపల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. ఉపాధ్యాయుడు మృతి పట్ల ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య, సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, ఉపాధ్యాయ సంఘ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.